పోలీసుల కవాతు

మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బస్తీలలో పోలీసులు కవాతు నిర్వహించారు. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలతో బస్తీలు, ప్రధాన వీధుల వెంట కవాతు చేపట్టారు. మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ ఎం. మహేశ్‌గౌడ్ ముందుండి అన్ని బస్తీలలో ఈ కవాతును నిర్వహించారు.

– అబిడ్స్, జనవరి 24

నోటు పుస్తకాలు పంపిణీ'

నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో.. జి.కిషన్‌రెడ్డి

గోల్నాక, జనవరి 24: అంబర్‌పేట నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. శుక్రవారం గోల్నాక డివిజన్ తులసీరాంనగర్ లంక ప్రభుత్వ పాఠశాలతో పాటు అంబర్‌పేట సీపీఎల్ ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి హాజరై తన సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన నోట్ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే లక్ష్యంతో పాఠశాలల్లో ఫర్నిచర్, కంప్యూటర్ ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్, బీజేపీ నాయకులు డాక్టర్ గౌతంరావు, జి.ఆనంద్‌గౌడ్, కన్నె రమేశ్‌యాదవ్, నాగభూషణంచారి, యశ్వంత్ పాల్గొన్నారు.

క్రిమేషన్‌గార్డెన్‌లో బాత్ హౌస్ ప్రారంభం

ఇమ్లిబన్ క్రిమేషన్ గార్డెన్స్, గోశాల కాంప్లెక్స్‌కు విచ్చేసే వారి సౌకర్యార్థం బాత్‌హౌస్, టాయ్‌లెట్ రూంను ఏర్పాటు చేసి ప్రారంభించారు. రాజస్థాని ప్రగతి సమాజ్ అధ్యక్షుడు కమల్ నారాయణ అగర్వాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీటిని ప్రధాన కార్యదర్శి గోవిందరాఠి ప్రారంభించారు. నందగోపాల్ భట్టడ్, మహేంద్ర వ్యాస్, అజయ్ శర్మ, అఖిలేశ్‌కుమా ర్, చిత్త రంజన్ ఆచార్య పాల్గొన్నారు. – అబిడ్స్, జనవరి 24

శివారెడ్డి గొప్ప సాహితీవేత్త

తెలుగు యూనివర్సిటీ, జనవరి 24 : రసమయి సాహితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు, సాహితీవేత్త ఆచార్య ఎల్లూరి శివారెడ్డి రచించిన 'మనసు పూచిన పూలు' కవితా సంపుటి ఆవిష్కరణ సభ ఆబిడ్స్ తిలక్‌రోడ్డులోని సారస్వత పరిషతు ఆడిటోరియంలో శుక్రవారం జరిగింది. విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి. రమణాచారి అధ్యక్షతన జరిగిన ఈ సభలో శివారెడ్డి రచించిన కవితా సంపుటిని పద్మభూషణ్ డాక్టర్ కె.ఐ. వరప్రసాదరెడ్డి దంపతులకు అంకితం ఇచ్చి సత్కరించారు. ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని తెలుగు భాషా సాహిత్యానికి శివారెడ్డి దశాబ్దాలుగా చేస్తున్న కృషిని కొనియాడారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య, ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ ఓలేటి పార్వతీశం, డాక్టర్ ఎం.నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ప్రముఖ సాహితీవేత్త ఆచార్య ఎల్లూరి శివారెడ్డి రచించిన మనసు పూచిన పూలు కవితా సంపుటి ఆవిష్కరణ సభలో పాల్గొన్న వక్తలు

ప్రయాగ్‌రాజ్‌కు సామూహిక యాత్ర

ఉత్తర్‌ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళాకు కార్వాన్‌లోని సబ్జీ మండీ నుంచి సామూహిక యాత్రకు బయలుదేరిన యాత్రికుల బస్‌కు జెండా ఊపీ ప్రారంభిస్తున్న గంగపుత్ర సంఘం మాజీ అధ్యక్షుడు గూడమోని అశోక్ కుమార్‌తో కట్టా నర్సింగ్‌రావు, గంటానరేశ్, చింత జయరాం, కట్టా శ్రీధర్, అనీల్ కుమార్, క్రిష్ణ గోపాల్, గిరి, సుబ్రమణ్యం, దినేశ్ తదితరులు. – కార్వాన్

ముదిరాజ్ జేఏసీ మహిళా.. చైర్‌పర్సన్‌గా రాణి

తెలంగాణ ముదిరాజ్ జేఏసీ మహిళా విభాగం గ్రేటర్ హైద్రాబాద్ చైర్‌పర్సన్‌గా చెరుకు రాణి నియమితులయ్యారు. తెలంగాణ ముదిరాజ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పొల్కం లక్ష్మీనారాయణ చెరుకు రాణికి నియామక పత్రం అందజేశారు. ముదిరాజ్‌ల అభ్యున్నతికి శాయశక్తులా తోడ్పాటునందిస్తానన్నారు. – కార్వాన్, జనవరి 24

ముగిసిన కుస్తీ పోటీలు

తాళ్లగడ్డలోని రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో ముగిసిన మడేలా రాజస్వామి ప్రథమ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ ముగిసిన సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేసిన కాంగ్రెస్ నాయకుడు అనుముల కొండల్‌రెడ్డి, నిర్వాహకులు. – కార్వాన్, జనవరి 24

అన్నదానం

టీఎన్‌జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖానలో సుమారు 600 మంది పేద రోగి సహాయకులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్ర మంలో డాక్టర్ బెంజిమెన్, టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు కురాడి శ్రీనివాస్, జిల్లా శాఖ సభ్యులు వైదిక్ శస్త్ర, శ్రీధర్ నాయుడు, ముఖీం ఖురేషీ, కేంద్ర సంఘం క్రీడా కార్యదర్శి బి. శంకర్, పీఆర్‌వో మహ్మద్ వహీద్, ఎంఎన్‌జే క్యాన్సర్ దవా ఖాన యూనిట్ అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి చంద్రశేఖర్, సభ్యులు సాయి కృష తదితరులు పాల్గొన్నారు.

– సుల్తాన్‌బజార్, జనవరి 24

కీర్తి పురస్కారాలు ప్రదానం..



కవి రామకృష్ణ చంద్రమౌళిని పురస్కారంతో సత్కరిస్తున్న వక్తలు

రవీంద్రభారతి, జనవరి 24 : అఖిలభారతీయ పద్మశాలి సంక్షేమ సంఘం హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం రవీంద్రభారతిలో కవిసమ్మేళనం, కీర్తి పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా ఆల్ ఇండియా దళితసేన అధ్యక్షుడు జేబీ రాజు, అఖిల భారత పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు తుమ్మ సత్యనారాయణ, సోషల్ యాక్టివిస్ట్ అమృత జైన్, బి. మధుసూదన్, కవి రామకృష్ణ చంద్రమౌళి, అఖిల భారత పద్మశాలి సంక్షేమ సంఘం సెక్రటరి సూరేపల్లి రవికుమార్, సరోజినీదేవి విచ్చేసి సమాజ సేవకులకు కీర్తి పురస్కారాలను ప్రదానం చేశారు. అనంతరం రామకృష్ణ చంద్రమౌళి ఆధ్వర్యంలో కవిసమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కొండా సహదేవ్, సి.సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

'నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ'

గోల్నాకలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, జనవరి 24 : గోల్నాక డివిజన్ శాంతినగర్‌కు చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు సురేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆవిష్కరించారు. శుక్రవారం గోల్నాక క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేసే వరకు పోరాడుతూనే ఉండాలని ఆయన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు సూచించారు.

ఆర్టీసీ సంస్థకు డ్రైవర్లే వెన్నెముక

డ్రైవర్స్ దినోత్సవంలో పాల్గొన్న ఆర్ఎం సుచరిత తదితరులు

కాచిగూడ, జనవరి 24: ఆర్టీసీ సంస్థకు డ్రైవర్లే వెన్నెముకని హైదరాబాద్ రీజినల్ మేనేజర్ సుచరిత అన్నారు. కాచిగూడ డిపో మేనేజర్ టి.రఘు ఆధ్వర్యంలో శుక్రవారం కాచిగూడ బస్ టర్మినల్‌లో డ్రైవర్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్ ఎం హాజరై మాట్లాడుతూ.. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే ధ్యేయంగా డ్రైవర్లు బస్సులను నడపాలని సూచించారు. ఈ సందర్భంగా లింగంపల్లి ఎక్స్‌రోడ్ నుంచి కాచిగూడ బస్ టర్మినల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కాచిగూడ, బర్కత్‌పుర, ముషీరాబాద్ డిపోలోని డ్రైవర్లు అత్యధిక హాజరుశాతం కలిగి, అక్సిడెండ్స్ చేయకుండా విధులు నిర్వహించినందుకు డ్రైవర్లను సన్మానించారు. డిప్యూటీ ఆర్.ఎం జగన్, ఆర్ఎంఓ బాబునాయక్, కాచిగూడ, బర్కత్‌పుర, ము షీరాబాద్, మేనేజర్లు టి.రఘు, మంజుల, కిషన్‌రావు, అయోధ్యరాములు పాల్గొన్నారు.

డాక్టర్ అచ్యుతాదేవికి ఐక్యత అవార్డు

పిన్సిపాల్ అచ్యుతాదేవిని సన్మానిస్తున్న ప్రొఫెసర్ ఎం.కుమార్

కాచిగూడ, జనవరి 24: నారాయణగూడలోని రాజా బహదూర్ వెంకట్రామ్‌రెడ్డి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.అచ్యుతాదేవికి స్వామి వివేనంద 162 జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా జాతీయ ఐక్యత అవార్డు– 2025ను ఉస్మానియా యూనివర్సిటీ చాన్సలర్ ఎం.కుమార్ ప్రదానం చేశారు. 32 ఏండ్లుగా విద్యారంగంలో విద్యార్థుల విద్యావృద్ధికి నిరంతరం సేవలందించినందుకు ఐక్యత అవార్డు దక్కింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి, జస్టిస్ నారాయణ, డాక్టర్ బాలాచారి, డాక్టర్ కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రేమ్‌చంద్, డాక్టర్ రవితేజ, ఉదయ్‌శ్రీరెడ్డి, కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించి, అభినందించారు.

మత్స్య కార్మిక సంఘం డైరీ ఆవిష్కరణ

డైరీని ఆవిష్కరించిన తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్

అబిడ్స్, జనవరి 24 : రాష్ట్రంలో మత్స్య పరిశ్రమ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ మెట్టు సాయికుమార్ అన్నారు. తెలంగాణ మత్స్య కార్మికులు, మత్స్య కార్మిక సంఘం డైరీని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మత్స్య సహకార సంఘాల వారిని అన్ని విధాలా ఆదుకునేందుకు బృహత్తరమైన ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ అదనపు డైరెక్టర్ మురళీకృష్ణ, మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెల్లెల బాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి గోరెంకల నరసింహ, మహిళా అధ్యక్షురాలు కొప్పు పద్మ, సభ్యులు పాల్గొన్నారు.

గోరక్షణ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి



పశువులకు గ్రాసం తినిపిస్తున్న మహేశ్ అగర్వాల్

కాచిగూడ, జనవరి 24: గోరక్షా చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనట్లు తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేశ్ అగర్వాల్ అన్నారు. జాతీయ పశు సంక్షేమ పక్షోత్సవాల సందర్భంగా శుక్రవారం గోశాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాత్యాయని గోశాలలో పశువులకు పశుదానాను పంపిణీ చేసి, మాట్లాడుతూ.. పశువుల అక్రమ రవాణాపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని, దీంతో కబేళాలకు పశువుల తరలింపు పెరుగుతుందని పేర్కొన్నారు. గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించి, గోరక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ప్రేమ్‌చంద్ మునోథ్, ఎ.మనోహర్ రాజు, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కింగ్‌కోఠిలో రక్తదాన శిబిరం

కింగ్‌కోఠిలోని తెలంగాణ చాంబర్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆల్ ఇండియా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్(ఏఐవోసీడీ) అధ్యక్షుడు జగన్నాథ్ షిండే 75వ జన్మదిన్నాన్ని పురస్కరించుకొని కెమిస్ట్ భవన్‌లో రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, జిల్లాలు, నగరాల్లో అఖిల భారత స్థాయిలో నిర్వహించిన రక్త దాన శిబిరాలలో 75వేల యూనిట్ల రక్తం సేకరించినట్లు తెలంగాణ చాంబర్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ డాక్టర్ ఫీసులాల్ జైన్, కోశాధికారి ఆనంద్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఈ కార్య క్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు సంజయ్‌కుమార్ జైన్ గన్‌ఫాండ్రి కార్పొరేటర్ డాక్టర్ సురేఖ, ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ ఎస్‌బీ కాబ్రా, మహేశ్, కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ రమేశ్‌కుమార్ బంగ్, లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ట్రస్టీ రిథేష్ జాగిర్దార్, నవజీవన్ మండల్ అధ్యక్షురాలు మీనా, ఐపీఎం డాక్టర్లు పాల్గొన్నారు.

– సుల్తాన్‌బజార్, జనవరి 24

అనారోగ్యంతో వ్యక్తి మృతి

కాచిగూడ, జనవరి 24: అనారోగ్యంతో రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(55)ఉందానగర్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం చివర్లో అనారోగ్యంగా ఉంటూ గురువారం రాత్రి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై నషం రంగు చొక్క, నలుపు రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.3 ఉన్నట్లు తెలిపారు. కేసును కాచిగూడ రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లెక్సీ తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదం

కార్వాన్, జనవరి24 : ఓ ఫ్లెక్సీ తయారీ కేంద్రంలో మంటలంటుకోవడంతో పరిశ్రమలోని యంత్రాలు, ముడి సరుకు అగ్నికి ఆహుతయ్యాయి. గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మొఘల్‌నగర్ పీవీ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నం బర్111 సమీపంలో మహ్మద్ నిజాముద్దీన్ యూనిక్ యాడ్స్ మీడియా పేరుతో సైన్ బోర్డులు, ఫ్లెక్సీలు తయారు చేసి సరఫరా చేస్తుంటాడు. శుక్రవారం మధ్యాహ్నం దుకాణంలో మంటలు వ్యాపించాయి. ఇది గమనించిన సిబ్బంది పోలీసులకు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఫైరింజన్ వచ్చి మంటలార్పింది. కాగా కార్ఖానాలో భారీ సైజు సిలిండర్లు ఉన్నప్పటికీ ఎలాంటి ప్రమాదం జరుగలేదు. గుడిమల్కాపూర్ పోలీసులు, కుల్సుంపురా ఏసీపీ మునావర్‌లు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్, కార్పొరేటర్లు ఎం. స్వామి యాదవ్, నసీరుద్దీన్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ బాధితుడికి ప్రభుత్వం తరపున సహాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సీసీ కెమెరాలతో భద్రత



సీసీ కెమెరాలతో నేరాలను అదుపు చేయవచ్చని కార్వాన్‌లోని శివ శంకర క్రాంతి సేవా సమితి అధ్యక్షుడు పడాల అనంత క్రిష్ణ అన్నారు. కార్వాన్‌లోని బంగారు మైసమ్మ ఆలయంలో ఆయన స్వంత ఖర్చులతో 4 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన సీసీ కెమెరాలను ప్రారంభించి మాట్లాడారు. – కార్వాన్, జనవరి 24

నుమాయిష్‌లో అందుబాటులోకి రెండు ఫైరింజన్‌లు

మాట్లాడుతున్న ఎగ్జిబిషన్ సొసైటీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ కన్వీనర్ వినయ్‌కుమార్ ముదిరాజ్, జాయింట్ కన్వీనర్ ఎం.రవిశంకర్

అబిడ్స్, జనవరి 24 : నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో కొనసాగుతున్న అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనలో ప్రమాదాల నివారణకు గాను రెండు ఫైరింజన్‌లను అందుబాటులో ఉంచడంతో పాటు లక్షన్నర నీటి సామర్థ్యం కలిగిన రెండు ట్యాంకులలో నీటిని నిల్వగా ఉంచినట్లు ఎగ్జిబిషన్ సొసైటీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ కన్వీనర్, ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు వినయ్‌కుమార్ ముదిరాజ్, జాయింట్ కన్వీనర్ ఎం. రవి శంకర్ తెలిపారు. కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. ఎగ్జిబిషన్ మైదానం అంతా 80 హైడ్రెంట్‌లు ఉన్నాయని, ఆయా హైడ్రెట్‌లు ఏడంతస్తుల ఎత్తు వరకు నీటిని చిమ్మే సామర్థ్యం కలిగి ఉంటాయని వివరించారు. ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు మైదానంలో 42 మంది నిష్ణాతులైన సిబ్బంది తిరుగుతూ ఉంటారని, వారికి జిల్లా ఫైర్‌సేఫ్టీ అధికారి వెంకన్న ప్రత్యేక శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనలో తాము ప్రతి నిత్యం మైదానంలో తిరుగుతూ సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కొర్రెముల భూములపై సీబీసీఐడీచే విచారణ జరిపించాలి

రవింద్రభారతి, జనవరి 24: మల్కాజిగిరి కొర్రెముల లోని 47,25 ఎకరాల భూమి తమదేనని, దీనిపై ప్రభుత్వం సీబీసీఐడీచే విచారణ జరిపించాలని శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్ భాగస్వాములు ఆలూరి వెంకటేశ్, విజయభాస్కర్ చెప్పారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ తన అనుచరులతో కలిసి తమ భూమిలోకి వచ్చి అక్కడున్న వారిపై దాడి చేయడం సమంజసంకాదని అన్నారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని ఈ భూమికి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతులు చెరుకు నరసింహ గౌడ్, ఎన్.వెంకటనారాయణ, బి.సురేందర్‌రెడ్డితో కలిసి మాట్లాడుతూ.. ఈ భూమి విషయంలో కొంత మంది రియల్ ఎస్టేట్ బ్రోకర్లు తప్పుదారి పట్టించారని, ఎంపీ ఈటల రాజేందర్ వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని, తగిన సమయం ఇస్తే పూర్తి వివరాలతో తెలియజేస్తామన్నారు. కోర్టు తీర్పును కూడా ఆయన పరిశీలించాలని కోరారు. మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని కొర్రెముల గ్రామంలోని సర్వే నెంబర్లు 739,740, 741, 742లో తమకు చెందిన 42.25 ఎకరాల భూమి ఉందని దాని పక్కనే సర్వే నెంబర్లు 743, 744, 745, 747కు చెందిన వారిలో కొంతమంది తమ భూమిని కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 2005లో తాము ఈ భూమిని కొనుగోలు చేయడం జరిగిందని, కాని కొంత మంది తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని విమర్శించారు. విచారణ జరిపిస్తే అన్ని విషయాలు బయటకు వస్తాయని వారు అన్నారు.

ఐహెచ్‌ఎంలో లిటిల్ ఇండియా-2025



వివరాలు వెల్లడిస్తున్న ఐహెచ్ఎం ప్రిన్సిపాల్ సంజయ్

అంబర్‌పేట, జనవరి 24 : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్(ఐహెచ్ఎం) ఆవరణలో ఈ నెల 25, 26 తేదీలలో లిటిల్ ఇండియా–2025 పేరుతో రెండు రోజుల ప్రత్యేక ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఐహెచ్ఎం ప్రిన్సిపాల్ సంయజ్ ఠాకూర్ తెలిపారు. శుక్రవారం వివరాలను వెల్లడించారు. భారత పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్వతంత్ర సంస్థగా ఈ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ ఉందన్నారు. ఈ ఉత్సవం మధ్యాహ్నం 12.30 నుంచి రాత్రి 10.30 వరకు జరుగుతుందన్నారు. ఉచిత ప్రవేశంతో అందరికీ అందుబాటులో కలదని అన్నారు. ఈ ఉత్సవంలో దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వివిధ రకాల వంటకాలకు సంబంధించి స్టాళ్లు ఉన్నాయని తెలిపారు. ఈ ఉత్సవంలో జపాన్, దక్షిణ కొరియా నుంచి వచ్చిన ఎన్ఆర్ఐ విద్యార్థులు కూడా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐహెచ్ఎం విభాగాధిపతి రచనా అగశే, హెడ్ పునీత్ రజ్దాన్, రాయల్ ఆర్చిడ్ హోటల్స్ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ సేల్స్ అమియ బైతారు, తాజ్ డెక్కన్ ఎగ్జిక్యూటివ్ చెఫ్ మన్‌ప్రీత్ సింగ్ మలిక్ అవాసా హోటల్ బిజినెస్ యూనిట్ హెడ్ గురునాథన్ గణపతి, తాజ్ డెక్కన్ జనరల్ మేనేజర్ అర్ణబ్‌గుప్తా, డీడీ కాలనీ కెనెరా బ్యాంకు మేనేజర్ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిజాం పాలన నుంచి విముక్తి కోసం వీర మరణం పొందిన తుర్రేబాజ్ ఖాన్

కోఠిలోని అమరవీరుల స్థూపం వద్ద తుర్రేబాజ్ ఖాన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ సభ్యులు

సుల్తాన్‌బజార్, జనవరి 24. నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి కోసం వీర మరణం పొందిన తుర్రేబాజ్ ఖాన్ గొప్ప విప్లవ కారుడని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు ఈటీ నరసింహ కొనియాడారు. శుక్రవారం సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కోఠిలోని మొదటి స్వాతంత్ర్య యుద్ధ అమరవీరుల స్మారక స్థూపం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు వీఎస్ బోస్, సామాజిక వేత్త మోటూరి క్రిష్ణ ప్రసాద్, సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బి. వెంకటేశంలతో కలిసి తుర్రేబాజ్ ఖాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు నెర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, మహ్మద్ సలీం, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరేడ్‌కు ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు

విద్యార్థులతో హెడ్‌మాస్టర్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు

కాచిగూడ, జనవరి 24: విద్యార్థులు విద్యతో పాటు వివిధ రంగాల్లో రాణించినప్పుడే గుర్తింపు ఉంటుందని కాచిగూడ ప్రభుత్వ హైస్కూల్ హెడ్‌మాస్టర్ కె.విజయలక్ష్మి అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 26వ తేదీన పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే పరేడ్‌కు కాచిగూడ ప్రభుత్వ హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులు ఎంపికయ్యారు. శుక్రవారం విద్యార్థులను పీఈటీ వి.లక్ష్మణ్‌నాయక్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఫిబ్రవరి 7న చలో ట్యాంక్‌బండ్

రవీంద్రభారతి, జనవరి 24 : ఎస్సీ వర్గీకరణ ఏబీసీడీ, రిజర్వేషన్ల వర్గీకరణ తక్షణమే అమలు చేయాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి7వ తేదీన లక్షడప్పులు–వేలగొంతుకలతో చలో ట్యాంక్‌బండ్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని మాదిగ పోరాట సమితి, మహజన పోరాట సమితి సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపింది. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బి.ఎన్.రమేశ్‌కుమార్ మాదిగ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ.. వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు వచ్చి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు మాదిగలకు ఏబీసీడీ వర్గీకరించి అమలు చేయడం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్గీకరణ చేసి తీరుతాని అసెంబ్లీలో ప్రకటించి ఇప్పటి వరకు వర్గీకరణ ఊసే ఎత్తడంలేదని అన్నారు. ఈ సమావేశంలో సంపత్,గద్దల కుమార్, ఈరెల్లి శ్రీనివాస్, పి.చిన్న అంజని,మల్లెపాక చంద్రమౌళి, ఆర్. భాగయ్యామాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఫీ బకాయిలు చెల్లించకుంటే ఢిల్లీ ఏఐసీసీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం

బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు రామకృష్ణ

కాచిగూడ, జనవరి 24: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలోని 16 లక్షల 75 వేల మంది ఫీజుల బకాయిలు వెంటనే చెల్లించాలని, లేనియెడల ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం కాచిగూడలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను సీఎం రేవంత్‌రెడ్డి గాలికి వదిలిపెట్టడాని ఆరోపించారు. రాష్ట్రంలో 16 లక్షల మంది విద్యార్థులకు గత మూడేళ్ల నుంచి ఫీజులు చెల్లించడం లేదని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించక పోవడంతో కాలేజీ యాజమాన్యలు విద్యార్థుల కోర్సు పూర్తి అయినప్పటికీ సర్టిఫికెట్లను ఇవ్వడంలేదన్నారు. కాంట్రాక్టర్లకు వేల కోట్ల బిల్లులు చెల్లిస్తున్నా..చదువుతున్న విద్యార్థులకు మాత్రం స్కాలర్‌షిఫ్‌లను చెల్లించడంలేదని ఆరోపించారు.